
# తుఫాను

— సలీం

బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం తుఫానుగా మారి, తీరం దాటే ముందు పెరుతుఫానుగా రూపుదాల్చి, విరుచుకు పడింది. ప్రకృతి తన ప్రళయ భీకరరూపంలో విలయతాండవం చేసింది. ఆ ప్రచండానిలానికి వూళ్లకు వూళ్లే తుడిచి పెట్టుకుపోయాయి. ఎటు చూసినా శవాల గుట్టలు – ఏ వైపు విన్నా జీవచ్ఛవాల వేదనలూ – రోదనలూ....



రాయన్న మనసులో సన్నగా ప్రారంభమైన ఆల జడి, వడి వడిగా పెరిగి – ఉధృతమై – వాయుగుండంగా మారింది.

గోడకూలి, ఓబులేసు వాళ్లమ్మ చచ్చిపోయిందని తెలిసి – పరామర్శించటానికి వెళ్లిన రాయన్న – తిరిగొచ్చేప్పటికీ సంక్షుభిత సంద్రంలా ఉన్నాడు.


లక్షరూపాయలు! లక్ష!! వెయ్యి వంద రూపాయల నోట్లు....అమ్మో! అంత డబ్బు తల్చుకోగానే రాయన్నకు మైకం కమ్మినట్లయింది.

ఓబులేసుకు పట్టిన అదృష్టాన్ని తల్చుకుంటే, గుండె ఈర్ష్యతో మండిపోతోంది. లక్షరూపాయలు...ఏం చేసుకుంటాడు? ముగ్గురూ మగపిల్లలే...చావుక్కూడా ఎంతటి నిర్దయో! తనకిద్దరు ఆడపిల్లలు...పెళ్లికెదిగి ఉన్నారు. ఆ లక్ష రూపాయలు తనకే ఉంటే....వాళ్లిద్దరి పెళ్లిళ్ళూ చేసి నిశ్చింతగా ఉండేవాడు కదా.....

ఆకాశం మీంచి వులిహోర పాట్లాలతో పాటు, చనిపోయిన వ్యక్తుల కుటుంబాలకు లక్షరూపాయల పరిహారం కూడా ప్రకటించింది రాష్ట్రప్రభుత్వం. లక్ష



తెలుగు కళా సమితి (న్యూజెర్సీ)
రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు)
ఆంధ్రజ్యోతి సచిత్రవార పత్రిక
సంయుక్తంగా నిర్వహించిన
1997 కథల పోటీలో
కన్సొలేషన్ బహుమతి
పొందిన కథ



రూపాయలు....రాయన్న కళ్లనిండా నోట్ల కట్టలు... కట్టలు....ఈ జన్మలో తను అంత డబ్బు చూడగ లడా....తనూ, భార్యా, ఇద్దరు కూతుళ్లూ రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడినా, ఆ వచ్చే కూలి పొట్టకూటికే సరిపోవటంలేదు. మరి లక్ష రూపాయలు రావాలంటే....ఏదేవుడో ప్రత్యక్షమై వరమిస్తే తప్ప... .ఏతుఫానో తనింట్లో శవమై తేలితే తప్ప...జరగదు.

రాయన్న మనసులో నిరాశ.....నివ్వగుండంలా మండుతూ..చావు కూడా వరం కావటం అంటే ఇదేనేమో. అందుకే ఎంతవెదకినా ఓబులేసు ఇంట్లో ఎవరి మొహంలోనూ విషాదం కన్పించలేదు. లక్ష రూపాయలంటే మాటలా....తమ మట్టి బ్రతుకుల్లో మన్నూ, మశానం తప్ప మణులూ, మాణిక్యాలూ దొరుకుతాయన్న వూహ కల్లో కూడా రాదు.

పరామర్శించటానికి వెళ్లిన వాళ్లలో కొంతమంది ఉండబట్టలేక అనేశారు కూడా – "ఓబులేసుకూ దస తిరిగింది. ముసల్దిపోతూ పోతూ అదురుష్టం తెచ్చిపెట్టింది. దాన్ని కనీ, పెంచీ, సచ్చిపోతూ కూడా లచ్చ రూపాయలు నాబం సేసింది. వదేలు ఇల్లు బాగుసేసుకోడానికి కర్సయినా మిగిల్న సొమ్ము బ్యాంకులో ఏసుకుంటే, బతికినన్నాల్లు కాల్మీద కాలేసుకుని బతకొచ్చు"అని.

రాయన్న మనసులో ఏర్పడిన వాయుగుండం, ఇప్పుడు బలపడి తుఫానుగా మారింది.

ఓబులేసు తల్లికి అరవై ఆరేళ్లుంటాయి. ఆగోడ కూలి ముసిల్దాని మీద పడకుండా ఉంటే మరో యేడు బతికేదేమో – గుడ్డి కన్ను మూసినా ఒక్కటే, తెరిచినా ఒక్కటే అన్నట్టు అది ఒకేడు బతికినా, పదేళ్లు బతికినా ఉద్ధరించేదేం ఉంది కాబట్టి.....ముసిల్ది ఎంత చక్కటి సమయం చూసుకుని పోయిందో..తంతే గారెల బుట్టలో పడ్డట్టు – చచ్చి లక్షరూపాయల్ని వరంలా కుమ్మరించింది.

రాయన్నకు జీవితం మీద విరక్తి కలిగింది. బతికి తన వాళ్ల జీవితాల్ని బాగుపర్చలేనప్పుడు, చచ్చి లాభం చేకూర్చటం మంచిదనిపించింది. కానీ, వచ్చిన అవకాశం చేజారిపోయింది.

రాయన్నకు పిచ్చిపట్టినట్లుంది. విసుగ్గా...చిరాగ్గా...అన్నం సయించడం లేదు. కునుకు పట్టడంలేదు. కన్పించని ఆ దేవుడి మీద వెర్రికోపం వస్తోంది. ఎంతటి పక్షపాతం! డబ్బులు ఎవరికయితే అవసరం లేదో, వాళ్ల దోసిట్లోనే గుప్పిటలు విప్పి మరీ కుమ్మరిస్తాడు. అనాది మండీ దోసిలి ఒగ్గి నిలబడిన తమలాంటి వాళ్లకు మొండి చేయి చూపిస్తాడు.

పెళ్లికెదిగిన తన ఇద్దరు కూతుళ్లను తల్చుకోగానే దిగులు సుడిగాలిలా జడివానలా రాయన్నను ముంచేసింది.

* * *

సుబ్బన్నకు డెబ్బైయేళ్ళుంటాయి. ఎండనకా, వాననకా కష్టించిన శరీరం ఇప్పటికీ ఆరోగ్యంగా, దృఢంగా వుంది. ఓబులేసు తల్లీ, సుబ్బన్న భార్యా దాదావు ఒకేసారి కాపురానికొచ్చారు. ఇద్దరూ చాలా స్నేహంగా వుండేవారు. ఓబులేసు తల్లి మరణంతో– తన భార్య జ్ఞాపకాలు సుబ్బన్న మనసుని కుదిపేశాయి.

నలుగురు పిల్లలు పుట్టి పోయాక ఆ పేరు పెట్టినందుకో ఏమో రాయన్న బతికాడు. అందుకే రాయన్న అంటే తన భార్యకు ప్రాణం– తనకు అంతులేని వాత్సల్యం.

రాయన్న మనసు కొద్దిగా నొచ్చుకుందని తెలిసినా– తన తండ్రి హృదయం తట్టుకోలేదు. ఓబులేసుని పరామర్శించడానికి వెళ్ళివచ్చినప్పటినుంచి రాయన్న ఆదోలా వుండడం తను గమనిస్తూనే వున్నాడు. రాయన్న కష్టాలూ.. కన్నీళ్ళు.. అవసరాలు అన్నీ తనకు తెలుసు. ఓబులేసుకు లక్ష రూపాయలు వచ్చిన విషయం తలచుకుని తన కొడుకు మథనపడడం తను చూస్తూనే వున్నాడు.

రాయన్న ఈ మధ్య చీటికి మాటికి పెళ్ళాన్ని కసురుకుంటున్నారు. ఆర్థిక అవసరాలు గుర్తొచ్చినప్పుడల్లా "మొన్నటి తుపాన్లో నేను సచ్చినా బాగుండేది. నీకు లచ్చ రూపాయలు వచ్చేవి. కూతుల్లకు పెల్లి సేయలేని ఈ ఎదవ బతుకు బతికేకన్నా, సచ్చి వుంటే వీల్లకి లచ్చనంగా లగ్గాలు జరిగుండేవి" అనడం సుబ్బన్నలో ఏవో తెలీని భయాలకు తావు కల్పిస్తోంది. డబ్బు వ్యామోహంలో పడి తన కొడుకు ప్రాణాల్ని పణంగా పెట్టాలని యోచించడం లేదు కదా!

సుబ్బన్నకు గుండె పిండేసినట్టయింది. నిండా యాభయి కూడా నిండని తన కొడుకు ఎందుకు చావాలి? జీవితాన్ని పరిపూర్ణంగా అనుభవించి, పండిపోయిన తను రాలిపోయి వుంటే బావుండేది. తను అంతగా ప్రేమించే తన కొడుక్కి ఏమివ్వగలిగాడు– వారసత్వంగా పేదరికం తప్ప. ఓబులేసు తల్లిలా, తను కూడా ఆ తుపానులో చచ్చిపోయి వుంటే, తన కొడుక్కి లక్ష రూపాయలు వచ్చి వుండేవి. ప్చ్! ఆ అవకాశం లేదిపుడు. మరలా రాదు.

ఆరోగ్యంగా వుండే తన శరీరాన్ని చూసుకుని ఇన్నాళ్ళూ గర్వపడిన సుబ్బన్న కిపుడే విచారాన్ని కల్గిస్తోంది. ఇంకా ఎన్నాళ్ళిలా బ్రతికి కొడుక్కి భారం కావాలి? కూలి కెళ్తానంటే "ఈ ముసిల్తనంలో నీకెందుకయ్యా కట్టం" అని ప్రేమగా అడ్డుపడే రాయన్న.. సుబ్బన్నకు జీవితం మీద విరక్తి పుట్టింది అతనిలో ఆకారం ఏర్పరచుకుంటూ ఓ కోరిక- జీవితం నుంచి సుదూరంగా వెళ్ళిపోవాలని...


* * *

తుపాను సృష్టించిన బీభత్సం నుంచి ప్రజలు, ప్రభుత్వమూ తేరుకోకముందే– బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడింది. అది బలపడి, తుపానుగా మారి, కోస్తా తీరాన్ని తాకింది.

మూణ్రోజుల్నుంచీ కుండపోతగా వర్షం కురుస్తోంది. గాలి ప్.. ప్..ప్.. అంటూ కసిగా వీస్తున్న శబ్దం.. రాత్రి పదకొండు గంటలు.. తుపాను ఉధృతికి ప్రాణాలరచేత పట్టుకుని రెండు రాత్రుళ్ళు జాగారం చేసిన రాయన్న భార్యా, పిల్లలూ ఆదమరచి నిద్రపోతున్నారు.

రాయన్నకు నిద్ర రావడం లేదు. మరలి రాదనుకున్న అదృష్టదేవత అందెల నాదంలా– తిరిగొచ్చిన వర్షపు చప్పుడు.. ప్రచండ వేగంతో వీస్తున్న గాలి– వింజామర వీవెనలా హాయిగా వుంది. ఓబులేసుని పరామర్శించడానికి వెళ్ళినపుడు ఏర్పడిన తుపాను, ఇపుడు అతని మనసులో వికృతంగా సుళ్ళు తిరుగుతూ, ప్రచండ తుపానుగా మారి అల్లకల్లోలం చేస్తోంది. ఆనాడు నాటుకున్న విషబీజం, నేడు వటవృక్షమై విశృంఖలంగా విస్తరిస్తోంది.

ఎపుడో అతని చిన్నప్పుడు కట్టించిన ఇల్లు. మట్టితో కట్టిన ఎత్తైన ఇటుక గోడలు.. పైన తాటాకులు



కప్పిన ఇల్లు. సుబ్బన్న పడుకునే మంచానికి ఆనుకుని వున్న గోడ కవతల ఇళ్ళు లేవు. అంతా ఖాళీ ప్రదేశం. అందుకే క్రితంసారి వచ్చిన తుపానుకు ఆ గోడ బాగా దెబ్బతింది. మట్టంతా కొట్టుకుపోయి- ఇటుకలు బైటికి వచ్చి శిథిలంలా కనిపిస్తోంది. మరో గోడ కానుకుని రాయన్న భార్యా- పిల్లలూ పడుకుని వున్నారు. ఆవైపు చుట్టూ కమ్ముకున్నట్టు ఇళ్ళుండడం మూలాన ఆ గోడ ఇంకా బలంగానే వుంది.

రాయన్న మనసులో క్రూరత్వం కోరలు సాచి నర్తిస్తోంది. కళ్ళనిండా నోట్లకట్టలు కనిపిస్తున్నాయి. లక్ష రూపాయలు.. మెదడు కుదుళ్ళలో మొలచిన రూపాయల నోట్ల చెట్లు.. అశాంతి.. అసహనం.. అంత జీర్ణావస్థలో వున్న ఆవైపు గోడ ఇంకా కూలదేం? మరమ్మతులు చేయిద్దామనుకునేలోపలే మరో తుపాను రావడం తన అదృష్టం. మూడ్రోజులనుంచి దేవుణ్ణి వేడుకుంటున్నాడు ఆ గోడ పడాలని.

రాయన్నలో ఓ క్షణం పాపభీతి.. అతనికి తండ్రిమీద ప్రేమ వుంది. కానీ తన కూతుర్ల మీద మరింత ప్రేమ వుంది. తన తండ్రికి వయసుడిగిపోయింది... ఎలాగూ ఓ రోజు పోవాల్సిందే కదా.. 'ఎంకన్నసామీ! గోడ కూలితే నీ కొండకొత్తా'నని పదే పదే మొక్కుకుంటున్నాడు. అయినా అటువంటి ఛాయలేమీ కన్పించడం లేదు. తుపాను ఉధృతి తగ్గుతున్నట్టుంది. రేపటికి వర్షం పూర్తిగా తగ్గినా తగ్గవచ్చు.

రాయన్నలో ఉవ్వెత్తున కడలి కెరటంలా ఎగసి పడుతూ- నిరాశ.. ఈసారి అవకాశం జారిపోతే మరలా రాదు. లక్ష రూపాయలు కావాలనుకుంటే మనసు రాయి చేసుకోవాల్సిందే.. ఆ గోడను కాలితో బలంగా తంతే చాలు.. విరుచుకుపడి పోతుంది. క్షణం... తండ్రీకొడుకుల బంధాన్ని మరచి- కళ్ళు మూసుకుని- కాలిని బలంగా విదిలిస్తే.. ఇటుకలు విరిగిపడ్డట్టు నోట్ల కట్టలు ఎగిరొచ్చి తన వొళ్ళో పడ్తాయి. కానీ తన తండ్రి తనను అల్లారుముద్దుగా పెంచిన తండ్రి.. తన సుఖం కోసం వళ్ళు హూనం చేసుకున్న తండ్రి.. రాయన్న నులక మంచంలో అసహనంగా కదిలాడు.

సుబ్బన్నకూ నిద్రపట్టడం లేదు. తుపాను మరలా రాబోతుందని తెలిసినప్పటినుంచి అనంతమైన ఆలోచనలు. జీవితాల్ని తన వాళ్ళకోసం త్యాగం చేసే అవకాశం చాలా కొద్దిమందికి రావచ్చు. కానీ ప్రాణాల్ని త్యాగం చేసే అవకాశం చాలా కొద్దిమందికే వస్తుంది. అటువంటి గొప్ప అవకాశం చేజారిపోయిందనుకుంటే.. దేవుడు కరుణతో మరలా అవకాశాన్ని కల్పించాడు.

తను మంచం వేసుకునే వైపు గోడ బలహీనంగా వుందని.. క్రితం వచ్చిన తుపానుకి బాగా పాని వుందని సుబ్బన్నకు తెలుసు. గట్టిగా కొడితే విరిగి పడిపోతుందని తెలుసు. అందుకే ఈ మూడ్రోజుల నుంచి మంచాన్ని గోడకు మరీ దగ్గరగా జరిపి పడుకుంటున్నాడు. "సామీ నాకు వేసు పేనాలు తీసుకుని- పాపం మూటకట్టుకుని పోలేను. నీవిచ్చిన పేనాల్ని నీవే తీసేసుకో" అని దేవుణ్ణి పదే పదే వేడుకుంటున్నాడు. అయినా ఆ దేవుడు కరుణించలేదు. ఆ గోడ పడలేదు. వయసుడిగినా బలంగానే వున్న తన శరీరంలా మొండికేసినట్టు అలానే నిలబడి వుంది.

సుబ్బన్నకు తన చావు ఖరీదు లక్ష రూపాయలని తల్చుకుంటేనే రక్తం కొత్త వూపిరి పోసుకుని ఉరకలేస్తోంది. బతికి వున్నప్పుడు పూచిక పుల్ల విలువ కూడా చేయని తన శరీరం- శవమైనాక... లక్ష రూపాయలు!

తుపాను తగ్గుముఖం పట్టే సూచనలు కనిపిస్తున్నాయి. మూడ్రోజులు ఎదురుచూసినా, తను కోరుకున్నది జరగలేదన్న దిగులు సుబ్బన్నలో... ఏం జరిగినా- ఏం చేసినా ఈ రాత్రే ఆఖరు అవకాశం.

సుబ్బన్న మనసు రాయి చేసుకున్నాడు. ఆత్మహత్య చేసుకున్నందువల్ల పాపం వస్తే వచ్చింది. ఆ లోకంలో తనకేమైనా పర్లేదు. ఈ లోకంలో తన కొడుకూ- అతని సంసారం సుఖంగా వుంటే చాలు. మంచం పక్కన వుంచుకున్న దుడ్డుకర్ర తడిమి చూసుకున్నాడు. దీంతో గోడను బలంగా పొడిస్తే చాలు.. రెండిటుకలు కదిల్తే. గోడంతా కుప్పకూలుతుంది. కర్రని చేతిలోకి తీసుకుంటూ 'మన రాయిగాడి కోసమేనే ఇదంతా- నేనూ వత్తున్నా' అనుకున్నాడు భార్యని తల్చుకుంటూ...

తన కొడుకు మంచంలో కదిలిన శబ్దమై- ఆగిపోయాడు. కళ్ళు చిట్లించి చూశాడు. రాయన్న లేచి తలుపు తీసుకుని బైటికెళ్తున్నాడు.

ఇంత వర్షంలో విసురుగావీస్తున్న గాలిలో రాయన్న బైటికి ఎందుకు వెళ్ళాడో సుబ్బన్నకో క్షణం అర్థం కాలేదు. లక్ష రూపాయల మీద ఆశ కొద్దీ ఏమైనా అఘాయిత్యం చేసుకోబోతున్నాడేమోనన్న ఆలోచన మరుక్షణం అతన్ని బలంగా తాకింది.

ఓ రెండు నిమిషాలు ఆగి చూశాడు- కొడుకు తిరిగి వస్తాడేమోనని. రాలేదు.. సుబ్బన్న చెవులు రిక్కించి విన్నాడు. వర్షం పడే చప్పుడూ.. బలంగా వీస్తున్న గాలి శబ్దం తప్ప ఏమీ వినిపించలేదు. మరో రెండు నిమిషాలు గడిచినా రాయన్న ఇంట్లోకి రాలేదు. సుబ్బన్నలో అంకురించిన భయం అనూహ్యంగా పెరగసాగింది.

సుబ్బన్న లేచి బైటికెళ్ళగానే ఛెళ్ళున మొహం మీద కొట్టింది జల్లు. కళ్ళను చిట్లించి చీకట్లోకి చూశాడు. ఏమీ కనిపించడం లేదు. నడుం పైనుంచి అనాచ్ఛాదితంగా వున్న అతని శరీరాన్ని వర్షపు చినుకులు వాడిగా తాకుతున్నా లెక్కచేయక కదిలి గోడ దగ్గరకెళ్ళాడు. ఓ నిమిషం తరువాత కళ్ళు చీకటికి అలవాటుపడ్డాయి. గాలి బలంగా వెనక్కి నెట్టేస్తోంది. తనను తాను నిలదొక్కుకుంటూ చూశాడు. గోడ దగ్గర లీలగా ఓ ఆకారాన్ని.

రాయన్న అయిదు నిమిషాలనుంచి ఆ గోడ దగ్గర స్తంభంలా నిలబడి వున్నాడు. ఇపుడతని కళ్ళకు లక్ష రూపాయలు- తండ్రి రక్తంతో తడిసి ఎర్రగా కనిపిస్తున్నాయి. కాళ్ళు- బలమైన తాళ్ళతో కట్టేసినట్టు.. కదలడం లేదు. తన కూతుళ్ళను

తరువాయి 68వ పేజీలో

## కంచికి కాదు మంచికి

రాత్రిందివా స్వప్నాలే. రచయిత కాల్పనిక జగత్తుకు ఊపిరులు. కొన్ని అనుభవాలు, మరికొన్ని అనుభూతులే మామూలు మనిషిని రచయితగా చేస్తాయి. అలాంటి ఉత్ప్రేరణ లోంచే నా మొదటి కథ 1980 లో పుట్టింది. తదాదిగా గత పదిహేనేళ్ల నుంచి కథలు రాస్తున్నాను.

శ్రీశ్రీ మరో ప్రపంచపు ఆవేశం, తిలక్ సృష్టించిన అమృతం కురిసిన రాత్రి లోని అనుభూతి. చలం కలం వెనుక ఆక్రోశం, బుచ్చిబాబు మానసిక విశ్లేషణ, ఇవన్నీ నా కథా ప్రయాణ మార్గంలో మజిలీలు. ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా భూభౌతిక శాస్త్రంలో ఎమ్మెస్సీ(టెక్) తీసుకున్నాను. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వపు సంస్థలో ఉద్యోగం. ముప్పైఆరేళ్ల క్రితం ఒంగోలు దగ్గర ఒక పల్లెటూళ్లో పుట్టుక. ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం.

'దిద్దుబాటు' దగ్గర ప్రారంభమైన తెలుగు కథ కాలంతో పాటు శైలీ, శిల్పం, సామాజిక స్పృహ, అనేక వాదాలను తనలో ఇముడ్చుకొని, కథ చాలా బలంగా ప్రస్తుతం ఉంది. కథ కంచికి కాకుండా మంచివేపు నడుస్తున్న అత్యుత్తమ కాలంలో, న్యూజెర్సీ తెలుగు కళాసమితి, రాజాలక్ష్మి ఫౌండేషన్ (మద్రాసు), ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 1997 కథానికల పోటీలో నా కథకు బహుమతి నిచ్చినందుకు న్యాయనిర్ణేతలకు, ఆంధ్రజ్యోతి సంపాదక వర్గానికి నా కృతజ్ఞతలు.

సలీం



## మగాళ్ల గురించి ఐశ్వర్య...

నటనలో ఆరితేరిందో లేదో గానీ మగవాళ్ల నడతలో వాళ్ల సైకాలజీని చెప్పడంలో ఐశ్వర్య ఆరితేరి పోయింది. ఆమె చేసిన ఈ విశ్లేషణ మగాళ్లకే సుమా! మగాళ్లలో హాస్యప్రియత్వం వున్న వాళ్లంటే ఆడాళ్లు ఎక్కువ ఇష్ట పడతారు. అంటూ ఐశ్వర్య విశ్లేషించింది. *

51వ పేజీ తరువాయి

తలచుకుని శక్తినంతా కూడదీసుకుని గోడను తన్నబోయి మరలా ఆగిపోయాడు. తన తండ్రి వాత్సల్యం అతన్ని వలయంలా చుట్టుకుంటోంది. మనసుని పాషాణంలా మార్చుకుని ఈసారి ఎలాగయినా సరే గోడను పడగొట్టాలని– కళ్లు మూసుకుని– శ్వాస బలంగా తీసుకున్నాడు. కాలు ఎత్తే లోపల– ఫెళఫెళమంటూ శబ్దం... ఆ వెంటనే ధడేల్‌మంటూ గోడ కుప్పలా కూలిపోయింది.

తమ ఇంటి పక్కనున్న చెట్టు కూలుతున్న శబ్దం విన్న సుబ్బన్న వేగంగా కదిలాడు. రాయన్నను వాటేసుకుని బలం కొద్దీ లాగి విసిరేశాడు. ఆ .వూపుకు రాయన్న దూరంగా వెళ్లి పడ్డాడు. చెట్టుగోడ మీద పడి, గోడ కూలిన శబ్దానికి పెద్దగా గగ్గోలు పెడుతూ రాయన్న భార్యాకూతుళ్లు బైటికి పరుగెత్తుకుంటూ వచ్చారు.

జరిగిందేమిటో. అర్థమైన రాయన్న– వెంటనే తేరుకుని లేచి నిలబడ్డాడు. తండ్రి కన్పించలేదు. అతడి బలహీనమైన మూలుగు మాత్రం విన్పించింది.

తన శరీరంమీద టన్నులకొద్దీ బరువనిపిస్తున్న ఇటుకల్ని తొలగిస్తున్న రాయన్నతో "ఏరా అయ్యా– దెబ్బలేమైనా తగిలాయా– అంత ఏమరుపాటు పెమాదం కదరా అయ్యా– ఓ ఛనం ఆలీసెం అయివుంటే ఎంత గోరం జరిగుండేది" అన్నాడు సుబ్బన్న చివరి శ్వాస వదులుతూ.

రాయన్నలో పశ్చాత్తాపం– పెనుతుఫానులా విరుచుకుపడుతూ. తన తండ్రి శరీరాన్ని చుట్టేసుకుని భోరున రోదిస్తున్న రాయన్న సంక్షుభిత సంద్రంలా వున్నాడు.

*

# గుండె దండోరా

ఎదగొద్దని ఎవరూ అనరు
నీ ఎదుగుదలకు మమ్మల్ని ఎరువుగా చేసుకోకు
చేప న్యాయం అన్యాయమని అరచిన గొంతే
మమ్మల్ని బుల్లి చేపల్ని చేస్తే ఎలా...?
అగ్రవర్ణంపై ఉగ్రాన్ని కురిపించేవాడా
నువ్వు మాకిపుడు అగ్రవర్ణానివి కావా
దండోరా ఫలిత దృశ్యానికి
నీ గుండె లయ తప్పితే ఎలా
మనువు కాలం నుంచీ మాలాగే
మట్టిలో మట్టిగా అణచబడిన వాడవే కదా
తోలు రంగులాగే
ఆత్మలు కూడా ఒక్కటిగా మసిలినవాళ్లం
మేధా ముకురంపై ప్రతిభ ప్రతిఫలించినా
రిజర్వేషన్ గాళ్లంటూ గేలిచేయబడ్డవాళ్లం
నూలి దార పోగుల్ని మైనం ముద్ద నుంచి లాగి
ఏకం చేసినట్లు
కష్టాలు కన్నీళ్లు మనల్ని కలిపిందనుకొనేవాళ్లం
ఏ వాదాన్నయితే కవిత్వంలో
ఇంతవరకూ మందుపాతర్లా దట్టిస్తూ వచ్చామో
ఏ ఆధిపత్య భావజాల ప్రకటనలకు
వ్యతిరేంగా ఐక్యమై పరిశ్రమించామో
ఏ న్యూనతా భావాన్ని ఊరి పొలిమేరల్నుంచి
వెలి వేయడానికి బలి పశువులా మారిపోయామో
ఒక లక్ష్య సాధన కోసం
ఒకే దిశలో పయనించే పాదాల్ని తొడుక్కున్న వాళ్లం
నా పాదాల్తో నీ పాదాలు కల్పి నడవాలి గాని
నా నెత్తిన పెడ్తే ఎలా...?
అమూర్త దళితుడు చూపుడు వేలు
నీ కలం పాళీకన్నా పదునెక్కినప్పుడు
సిరల్లో సిరా రక్తం ఇంకించుకొని
చల్లగా జారుకోవడం కాదు
ధమనుల్లో కొత్త ధైర్యాన్ని నింపుకొని
వెల్లువగా మమ్మల్ని తోడుకోవాలి
మా డిగాలు పడని పోరాట విధానం
ఆత్యాధిపత్యం గొంతులో కరక్కాయే
మా అలుపెరుగని ఊరేగింపు విధానం
దివాలాకోరు రాజకీయ ఎత్తుగడలకు చెంపపెట్టు
'మనమంతా ఒక్కటే' మూస పూరిత ప్రకటన మాని
మా చర్మ డమరుకు ధ్వనితో శృతి కలుపు
ఇన్నాళ్లూ నిందలు పడ్డ నిఖార్సు కవీ
ఇప్పుడు మా దండోరాను అస్పశ్యం చేయకు

–ఎస్.ఆర్.భల్లం

